# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 52, EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 13 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 52, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 14 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


### అవినాష్ బెయిల్ రద్దు...

## 19కు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

వైఎస్ వివేకా హత్య కేసులో కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో మంగళవారం నాడు విచారణ జరిగింది. తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ డాక్టర్ సునీత నర్రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సునీతకు సహకరించేందుకు

మిగతా 2లో...

### జనవరి 22న

## అయోధ్య ఆలయం ప్రారంభం



**లక్నో - ప్రభాత సూర్యుడు**

వచ్చే ఏడాది జనవరి 22వ తేదీన అయోధ్యలోని రామ మందిరంలో శ్రీరాముడిని ప్రతిష్ఠించబోతున్నారు. పూజకు హాజరుకావాలంటూ ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం పంపారు. దీనిపై ప్రధాని మోదీ నుంచి ఇంకా స్పందన రాలేదు. రామ మందిరాన్ని దర్శించుకోవాలనే కోట్లాది మంది భక్తుల నిరీక్షణకు తెరపడనుంది. రామమందిరంలో శ్రీరాముడి విగ్రహప్రతిష్ఠ వచ్చే జనవరి 22 జరగనుంది. ఈ సమయంలో దేశంలోని అన్ని ప్రాంతాల్లోని శ్రీరాముని ఆలయాలను అలంకరిస్తారు. శ్రీరామ జన్మభూమి ఆలయంలో నిర్వహించే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని దేశంలోని వివిధ ప్రాంతాల్లో వర్చువల్గా ప్రదర్శిస్తారు. క్రౌడ్ మేనేజ్ మెంట్ కు సంబంధించి సమగ్ర ప్రణాళికను కూడా సిద్ధం చేశారు. ఇప్పటి వరకు గర్భగుడి పై భాగంలో పనులు జరుగుతున్నాయి. 2023

మిగతా 2లో...

## కాంగ్రెస్‌లోకే..

# పొంగులేటి, జూపల్లి

- రేపే ప్రకటన ?
- ఖమ్మం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కూడా!
- రేపు ప్రెస్‌మీట్‌లో ప్రకటించనున్న నేతలు
- అమిత్‌షా ఖమ్మం టూర్‌కు ఒకరోజు ముందే..బీజేపీకి నిరాశ.. కాంగ్రెస్ పార్టీలో జోష్.. ఖమ్మం అసెంబ్లీ బరిలోకి పొంగులేటి?



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

బీఆర్ఎస్ బహిష్కృత నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ లో చేరికకు ముహూర్తం ఖరారైంది. వీరికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కూడా జత కలవనున్నారు. వీరు ముగ్గురూ కలిసి బుధ వారమే హైదరా బాద్‌లో విలేక రుల సమావేశం నిర్వ హించి కాంగ్రెస్‌లో తమ చేరిక విషయాన్ని ప్రక టించనున్నట్లు సమాచారం. ఈ సంద ర్భంగా బీఆర్ఎసను వీడాల్సివచ్చిన పరిస్థి తులు, తాము ఎదుర్కొన్న ఇబ్బందుల తోపాటు తమ భవిష్యత్తుపై నిర్ణయాన్ని కూడా ప్రకటి స్తారని తెలిసింది. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఖమ్మం జిల్లా పర్యటనకు సరిగ్గా ఒకరోజు ముందే కాంగ్రె?సలో చేరికకు సంబంధించి వీరు ప్రకటన చేయనుండడం గమనార్హం. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాకే చెందిన నేత కావడం, ఖమ్మంలో అమిత్‌షా సభకు ముందురోజే తన నిర్ణయాన్ని వెల్లడించనుండడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల నేతలు, మాజీ ఎమ్మెల్యేలు కూడా పొంగులేటితోపాటు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో పొంగులేటి.. కాంగ్రెస్ తరఫున ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. పొంగులేటి శ్రీనివా సరెడ్డి చాలా కాలంగా బీఆర్ఎస్ అధిష్ఠానంపై అసంతృప్తి తో ఉన్నారు. పార్టీపై బహిరంగంగానే విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఒకదశలో అధిష్ఠానం ఆయనతో మాట్లాడినా.. పార్టీలో ఉండేందుకు ఇష్టపడలేదని సమాచారం. దీంతో సీఎం కేసీఆర్ ఒక సందర్భంలో, "పొంగులేటి పోతాడు.. వదిలేయండి" అని అంతర్గత సమావేశంలో వ్యాఖ్యానించారు. అయితే పొంగులేటి ఒంటరిగా కాకుండా.. జిల్లాలోని తన అనుచర గణాన్ని వెంట తీసుకొని మరీ పార్టీని వీడుతుండడమే

మిగతా 2లో...

### రేవంత్ రెడ్డి సక్సెస్..

## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

### కేసీఆర్ అత్యంత సన్నిహితుడు కూచాడి శ్రీహరిరావు రాజీనామా..

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**




తెలంగాణ రాజకీయాలు శర వేగంగా మారిపోతున్నాయ్. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నేతల జంపింగ్‌లు ఎక్కువయ్యాయి. ఏ పార్టీలో అయితే తమకు ప్రాధాన్యత ఉంటుందో.. ఎక్కడైతే టికెట్ దక్కే ఛాన్స్ ఉంటుందో అని లెక్కలేసుకుని కండువాలు మార్చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నుంచి అధికార పార్టీలోకి వెళు న్నారంటే ఓ లెక్కుంటుంది.. కానీ అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష పార్టీలోకి వెళ్తుండటంతో బీఆర్ఎస్‌లో అసలేం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొందని అధిష్టానం

మిగతా 2లో...

## సొమ్ము కేంద్రానిది....సోకు మీదా?

- మీరు జాప్యం చేసి మాపై నిందలా?
- సిగ్గులేకుండా మా ఘనతేనంటూ గొప్పలు చెప్పుకుంటారా?
- కరీంనగర్ ఆర్వోబీ నిర్మాణ వ్యయమంతా కేంద్రానిదే
- 80 శాతం వాటా ఇస్తానంటూ అంగీకరించి మాట తప్పింది మీరు కాదా?
- వెంటనే పనులు ప్రారంభించి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయండి
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధ్వజం

**కరీంనగం - ప్రభాత సూర్యుడు**



కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని తీగలగుట్ట సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ ఓబీ) నిర్మాణానికి సంబంధించి టెండర్లు ఖరారైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఘనతగా చెప్పుకుంటూ బీఆర్ఎస్ నేతలు సీఎంకు పాలాభిషేకం చేస్తూ సంబురాలు చేసుకోవడంపట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ తప్పుపట్టారు. ఆర్వోబీ కేంద్రం ఆమోదం తెలిపి 7 నెలలైనా ఇంతవరకు ఎందుకు టెండర్ పనులను ఖరారు చేయలేదో సమా ధానం చెప్పాలని ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం 126 కోట్ల 74 లక్షల రూపాయలను కేంద్రమే చెల్లించేందుకు అంగీకరించిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్వోబీ నిర్మాణ పనులను ప్రారంభించి తొందరగా పూర్తి చేయాలని అనేకమార్లు తాను ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం వాస్తవం కాదా? జాప్యాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేసింది నిజం కాదా? అని అన్నారు. "ఇదిగో... ఆధారాలు.. ఆర్వోబీ నిర్మాణం, నిధుల కేటాయింపు తోపాటు తొందరగా పనులు పూర్తి చేయా లంటూ నేను ప్రభుత్వానికి, అధికారులకు రాసిన లేఖలివిగో..." అంటూ కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత శాఖ అధికారులకు రాసిన లేఖలను, ప్రత్యుత్తరాలను మీడియాకు విడుదల చేశారు." ఆర్వోబీ నిర్మాణానికయ్యే ఖర్చులో 80 శాతం వాటా చెల్లించడానికి తొలుత అంగీకరించింది మీరే. ఆ తరువాత మాట తప్పింది మీరే. కేంద్రమే నిర్మాణ వ్యయం మొత్తాన్ని

మిగతా 2లో...

### మహిళా సంక్షేమంలో

## తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శం: కేటీఆర్



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

మహిళా సంక్షేమంలో తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ సర్కార్ అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి ఆరు పదులు దాటిన అవ్వల వరకు అందరినీ కంటికి రెప్పలా కాపాడుతుందని తెలిపారు. ఆకాశంలో సగం కాదు.. ఆమే ఆకాశం అని.. సంక్షేమంలో సగం కాదు.. ఆమే అగ్రభాగం అని వ్యాఖ్యానించారు. అమ్మఒడి వాహనమైనా.. ఆరోగ్యలక్ష్మి పథకమైనా..

మిగతా 2లో...

### రాజకీయ నాయకుడిలా వ్యవహరిస్తున్న

## ఐఏఎస్ అధికారి

### టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



ఓఆర్ఆర్ లీజుకు సంబంధించిన వ్యవహారంలో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ పంపిన లీగల్ నోటీసుకు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమాధానం ఇచ్చారు. ఓఆర్ఆర్ లీజుకు సంబంధించి ఐఏఎస్ అధికారి మే 25న ఇచ్చిన లీగల్ నోటీసులను వెనక్కి తీసుకోవాలన్నారు. అరవింద్ కుమార్ పంపిన లీగల్ నోటీసు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని వ్యాఖ్యలు చేశారు. అధికార పార్టీ అక్రమాలపై ప్రశ్నిస్తున్నందుకు తనను అణిచివేయాలనే ఈ నోటీసు పంపారన్నారు. లీగల్ నోటీసులో పేర్కొన్న ఆరోపణలన్నీ బూటకమని మండిపడ్డారు. ఓఆర్ఆర్ టెండర్ వ్యవహారంలో రాజకీయ నాయకుడిలా అరవింద్ వ్యవహరిస్తున్నా రన్నారు. అడిగిన సమాచారం ఇవ్వకుండా రాజకీయ నాయకుడిలా ఎదురు దాడి చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ ఆగ్రహం

మిగతా 2లో...

### రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ

## తాగునీరు అందించిన ఘనత కెసిఆర్‌ది

### రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట - ప్రభాత సూర్యుడు**



: తొమ్మిదేండ్ల కిందటి తెలంగాణకు ఇవాళ్టి తెలంగాణకు గుణాత్మకమైన మార్పు ఉన్నదని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎంతో మంది సీఎంలు వచ్చినా తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డల మంచినీటి గోస తీర్చలేదని, కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చి సీఎం కేసీఆర్ వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ తాగునీరు అందించినట్లు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సిద్ధిపేట జిల్లా నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాక రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, దుబ్బాక నియోజకవర్గ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్ రావు హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి తొమ్మిదేండ్లు పూర్తయి పదో సంవత్సరంలో అడుగు పెట్టిన వేళ.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరిపితే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు జీర్ణం అయితలేదని, ఫెయిల్యూర్ అంటూ నోటికొచ్చినట్లుగా పిచ్చిగా మాట్లాడుతున్నారని ప్రతిపక్ష పార్టీలపై మంత్రి హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. ఇప్పటి దాకా రూ. 6 వేల కోట్లు వరి ధాన్యం డబ్బులు రైతులకు అందించాం అని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజ కొంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు. ప్రతి పక్షాలు చెప్పే

మిగతా 2లో...

### కిం...కర్తవ్యం...

## మౌనంగా ఈటెల

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



తెలంగాణ బీజేపీ రాజకీయాలు రోజురోజుకీ హాట్‌హాట్‌గా మారుతున్నాయి. అధ్యక్ష పదవి మార్పు అంశం తెరపైకి వచ్చాక సమీకరణాలు వేగంగా కదులుతున్నాయి. ఈటెలకు పదవి ఖాయమనే ప్రచారాన్ని వ్యతిరేకిస్తూ ఓ మాజీ ఎంపీ ఆధ్వర్యంలో మరో బ్యాచ్ తెరవెనుక సమావేశాలు మొదలు పెట్టడం ఆసక్తిగా మారింది. తెలంగాణ బీజేపీలో రాజకీయం వేడెక్కింది. అధ్యక్షుడి మార్పు అంశం ఆ పార్టీలో కలకలం రేపుతోంది. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించి మరొకరికి అప్పగిస్తారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. దాంతో.. నిన్నమొన్నవరకు కాంగ్రెస్ అనుకుంటే ఇప్పుడు బీజేపీలోనూ

మిగతా 2లో...

## సొమ్ము కేంద్రానిది.... సోకు మీదా?

(మొదటిపేజీ తరువాయి)

భరించేందుకు సిద్ధమై ఆమోదం తెలిపినా పనులను ప్రారంభించకుండా జాప్యం చేసింది మీరే. తిరిగి కేంద్రం వల్లే జాప్యమవుతోందంటూ కేంద్రంపై నిందలేస్తారా?" అంటూ బీఆర్ఎస్ నేతలను నిలదీశారు. సొమ్ము కేంద్రా నిదైతే... సోకు బీఆర్ఎస్ నేతలదే... అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటూ పాలాభిషేకాలు చేసుకుంటు న్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా... ఆర్వోబీ నిర్మాణం విషయంలో జరుగు తున్న జాప్యా నికి తామే కారణమంటూ ముక్కు నేలకు రాసి కరీంనగర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు వెంటనే పనులు ప్రారంభించి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసి కరీంనగర్ ప్రజలకున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత కెసిఆర్‌ది

(మొదటిపేజీ తరువాయి)

మాటలు నమ్మొద్దు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు లేవని రాష్ట్ర మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.దేశంలోని 13 రాష్ట్రాలలో మహిళా బీడీ కార్మికులు ఉన్నారని, కానీ వారికి ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయి ఇవ్వట్లేదని, కానీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో బీడీలు చేసే మహిళా కార్మికులకు రూ.2 వేల చొప్పున పెన్షన్ ఇస్తున్నారని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో 1.18 లక్షల మందికి పింఛన్లు ఉంటే, ఇవాళ 2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. డబుల్ ఇంజన్ సర్కారు బీజేపీ పాలిత రాష్ట్రాలలో పెన్షన్ రూ. 600 ఇస్తే, తెలంగాణ రాష్ట్రంలో రూ. 2 వేలు ఇస్తున్నామని తెలిపారు.తెలంగాణ వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రులు అభివృద్ధి చేసుకున్నాం అని మంత్రి తెలిపారు. 70 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగితే 30 శాతం ప్రయివేటులో జరుగుతున్నాయని పేర్కొన్నారు. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్స్ ప్రారంభిస్తామన్నారు. గర్భిణీలకు 4వ, 7వ నెలలో ఈ న్యూట్రిషన్ కిట్లు అందిస్తాం అని చెప్పారు. గర్భిణీకి రక్త హీనత తగ్గించడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## రాజకీయ నాయకుడిలా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు.అధిక ఆదాయం వచ్చే ఆస్కారం ఉన్నా ఆ దిశగా ఆలోచన చేయడంలేదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి కేవలం రూ.7380 కోట్లకే ఐఆర్బీ సంస్థకు 30 ఏళ్లకు ఓఆర్ఆర్ టోల్ వసూలు టెండర్ ఇచ్చారన్నారు. ఐఆర్బీ సంస్థకు టెండర్ కట్టబెట్టే క్రమంలో యదేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆరోపించారు. ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా బేస్‌ప్రైస్‌పై అరవింద్ కుమార్ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ఓఆర్ఆర్‌పై ట్రాఫిక్, టెండర్ విలువను మదింపు చేసిన మజర్స్ నివేదికను కూడా పబ్లిక్ డొమైన్లో పెట్టడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్ అధికారి స్థానంలో ఒక రిటైర్డ్ ఆఫీసరును నియమించి ఓఆర్ఆర్ టెండర్ టెండర్ ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. ఎన్ని నోటీసులిచ్చినా ప్రజల తరఫున పోరాడుతూనే ఉంటానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌లోకే.. పొంగులేటి, జూపల్లి

(మొదటిపేజీ తరువాయి)

కీలకంగా మారింది. ఈ మేరకు ఆయన గత కొన్నినెలలుగా నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ వచ్చారు. ఆ సమావేశాల్లో తన భవిష్యత్తు రాజకీయ వ్యూహంపై కూడా చర్చించారు. తొలుత బీజేపీలో చేరాలని పొంగులేటి భావించినా.. ఇందుకు ఆయన అనుచరుల నుంచి పూర్తి మద్దతు రాలేదు. దీంతో ఆయన పలు దఫాలుగా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ నేతలతో సమావేశమై చర్చలు జరిపారు. బీజేపీ చే రికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్‌తో, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితో కూడా ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. కానీ, ఆ పార్టీ నుంచి తగిన భరోసా రాలేదన్నది సమాచారం. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో అయితేనే బాగుంటుందనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది.ఒకరు ఇద్దరై.. ఆ తర్వాత ముగ్గురైబీఆర్ఎస్ అధిష్ఠానం పట్ల అసంతృప్తిని తొలుత పొంగులేటి ఒక్కరే ప్రకటించగా.. నెల రోజుల క్రితం ఆయనకు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు తోడయ్యారు. జూపల్లి కలిశాక తాము ఎటువైపు వెళ్లాలన్నదానిపై ఇద్దరి మధ్య అంతర్గత సమావేశాలు జరిగాయి. అదే సమయంలో ఇద్దరూ కలిసి పలువురు నేతలతో రహస్యంగా సమావేశాలు నిర్వహించారు. వారం రోజుల క్రితం వీరికి బీఆర్ఎ?సకే చెందిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి జత కలిశారు. దీంతో ముగ్గురూ కలిసి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో చర్చలు జరిపారు. ఈ 14న సంయుక్తంగా హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి తమ నిర్ణయాన్ని వెల్లడిస్తారని తెలుస్తోంది. అయితే ఈ ముగ్గురు నేతలు కాంగ్రె?సలోకి వెళ్లడమనేది అధికార బీఆర్ఎ?సకే కాకుండా బీజేపీకి కూడా నిరాశ కలిగిస్తోందని అంటున్నారు. కాంగ్రెస్ నేతలు మాత్రం ఈ పరిణామం భవిష్యత్తులో తమకు బూస్ట్‌గా ఉపకరిస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సోమవారం సీఎం కేసీఆర్ గద్వాల జోగులాంబ జిల్లాలో జరిపిన పర్యటనలో పాల్గొని ఆశ్చర్యపరిచారు. కేసీఆర్ వెంట పర్యటన ఆసాంతం ఉండడంతోపాటు గద్వాలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలోనూ పాల్గొన్నారు. సభావేదికపై బీఆర్ఎస్ నేతలతో కలిసి కూర్చున్నారు. దీంతో ఆయన నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## జనవరి 22న అయోధ్య ఆలయం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

అక్టోబర్ నాటికి రామాలయం మొదటి అంతస్తు సిద్ధమవు తుందని, 22 జనవరి 2024న నాటికి ప్రతిష్టకు సిద్ధమవుతున్నట్టు ట్రస్టు నిర్వహకులు తెలిపారు. సుమారు ఏడు రోజుల పాటు ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత రామ భక్తులను ఆలయంలోకి ప్రవేశం కల్పిస్తారు. అయోధ్య రామ మందిర నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి తుది రూపుకు తీసుకొచ్చేందుకు అంతా సిద్ధమవుతోంది. ఎప్పటికప్పుడు ఈ నిర్మాణ పనులపై అప్‌డేట్స్ ఇస్తున్న ట్రస్ట్ ఇప్పుడు మరో ఆసక్తికర విషయం వెల్లడించింది. రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ముహూర్తం ఎప్పుడో చెప్పింది.వచ్చే ఏడాది జనవరి 22వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు ట్రస్ట్ ప్రకటించింది. జనవరిలోనే ఆలయ సందర్శనకు భక్తులకు అనుమతి ఇవ్వనున్నారు. అయితే... అప్పటికీ కొంత మేర పనులు మిగిలి ఉంటాయని, భక్తులకు అనుమతినిస్తూనే ఆ పనులు కొనసాగిస్తామని ట్రస్ట్ వెల్లడించింది.సాలిగ్రామాలతో రాముడు, సీత విగ్రహాలను చెక్కనున్నారు. ఇందుకోసం నేపాల్ నుంచి ప్రత్యేక శిలల్ని తెప్పించారు. గండకి నదీ తీరంలో వీటిని గుర్తించి తీసుకొచ్చారు. ఈ శిలలకు 6 కోట్ల సంవత్సరాల చరిత్ర ఉన్నట్టు భావిస్తున్నారు. రాముడి విగ్రహం తయారయ్యాక.. స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రాణపతిష్ఠ చేయనున్నారు. ఇదే విషయాన్ని శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ స్పష్టం చేసింది. ఇప్పటికీ ఆలయ నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇవి మూడు రెట్లు పెరిగాయి. రాముడి విగ్రహ తయారీపై ప్రత్యేక దృష్టి సారించింది రామ మందిర ట్రస్ట్. దాదాపు ఆరడుగుల రాముడి విగ్రహాన్ని తయారు చేయించి...వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి ప్రతిష్ఠించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అయితే..ఈ విగ్రహ తయారీ కోసం ప్రత్యేక శిలలు తెప్పించింది. నేపాల్ నుంచి రెండు సాలగ్రామ శిలలను తరలించారు. ఇప్పటికే ఇవి అయోధ్యకు చేరుకున్నాయి. రామ మందిర ప్రాంగణానికి చేరుకోగానే పూజారులు, స్థానికులు ఆ శిలలకు ఘనస్వాగతం పలికారు. పూలతో అలంకరించారు. పూజలు చేశారు. ఆ తరవాత ఆ శిలలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అప్పగించారు.రాముడితో పాటు సీతా దేవి విగ్రహాన్నీఈ శిలతోనే తయారు చేస్తున్నారు.

గర్భాలయంలో ఈ రెండు విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. నేపాల్‌లోని కలి గండకి నదీ తీరంలో ఈ శిలలను సేకరించారు. వీటిని సీతాజన్మ స్థలిగా భావించే జానక్‌పూర్ నుంచి ప్రత్యేక క్రేన్‌ల ద్వారా అయోధ్యకు తరలించారు. ఈ రెండు సాలగ్రామ శిలల్లో ఒక దాని బరువు 18 టన్నులు కాగా...మరోటి 16 టన్నులు. విగ్రహ తయారీకి ఈ రెండు శిలలు అనువుగా ఉన్నట్టు అధికారులు నిర్ధారించారురాముడి ఆలయంతో పాటు అదే ప్రాంగణంలో మిగతా దేవుళ్ల ఆలయాలూ నిర్మించనున్నారు. ఈ కాంప్లెక్స్‌లో సూర్యాలయం, గణేషుడి ఆలయం, హనుమాన్, అన్నపూర్ణ మాత ఆలయాలు నిర్మించాలని ట్రస్ట్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. పార్క్ వెలుపల అగస్త్య, విశ్వామిత్ర, వశిష్ఠ, మాతా శబరి, జటాయు, అహల్య ఆలయాలు నిర్మించనున్నారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో సుగ్రీవ ఆలయం కూడా నిర్మిం చాలని నిర్ణయించారు. శ్రీరామ జన్మభూమి కాంప్లెక్స్‌లో సుగ్రీవుని ఆలయం కూడా రూపుదిద్దు కోనుంది. ఇప్పటికే అయోధ్యలో రామాలయ గోపురం కనిపిస్తోంది. స్తంభాలను ఎక్కడికక్కడ పేర్చడం వల్ల ఓ రూపుకు వచ్చింది. మొదటి అంతస్తు ఎత్తు దాదాపు 20 అడుగులుగా ఉండనుంది.

## మహిళా సంక్షేమంలో తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శం: కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

నీతి ఆయోగ్ ప్రశంసల వర్షం.. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ హర్షం దక్కిందని అన్నారు.దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. భర్తను కోల్పోయిన అక్కాచెల్లెళ్లకు అన్నలా.. ఒంటరి మహిళలకు తండ్రిలా.. ఆడబిడ్డలకు మేనమామలా.. అవ్వలకు పెద్దకొడుకులా.. కొండంత అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మనసారా ఆశీర్వదిస్తున్న యావత్ మహిళా లోకానికి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఆయన ట్వీట్ చేశారు.కల్యాణలక్ష్మి కేవలం పథకం కాదు? ఒక విప్లవం అని తెలిపారు. ఓవైపు భ్రూణహత్యలకు బ్రేక్ వేసిందని.. మరోవైపు బాల్యవివాహాలకు ఫుల్ స్టాప్ పెట్టిందని.. ఇంకోవైపు తల్లిదండ్రుల భారాన్ని దించే భరోసా అని పేర్కొన్నారు. పదిలక్షలకుపైగా ఆడబిడ్డల పెండ్లిళ్లు చేసిన మేనమామ సీఎం కేసీఆర్ అని కొనియాడారు. గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్లదూరం నడిచిన మహిళల కష్టాలను మిషన్ భగీరథతో శాశ్వతంగా తీర్చిన విజన్ ఉన్న ముఖ్యమంత్రి.. కేసీఆర్ అని అన్నారు. మన అంగన్వాడీలను, ఆశా కార్యకర్తలను వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించి.. దేశంలోనే అత్యధిక పారితోషికాలు ఇచ్చి గౌరవప్రదంగా జీవించే అవకాశం కల్పించారన్నారు. ఆడబిడ్డల సంక్షేమంలో మనకు ఎదురులేదని.. మహిళా సాధికారతలో తెలంగాణకు తిరుగులేదని వ్యాఖ్యానించారు.

## కిం...కర్తవ్యం... మౌనంగా ఈటెల

(మొదటిపేజీ తరువాయి)

గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. అధ్యక్ష పదవి మార్పుపై.. అనుకూల వర్గం ఒకవైపు.. వ్యతిరేక వర్గం మరోవైపు మీటింగ్స్ పెట్టడం బీజేపీలో హీట్ పుట్టిస్తోంది. ఇప్పటికే ఢిల్లీతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఈటెల రాజేందర్ చక్కర్లు కొట్టడం.. ఆయనకు పదవి ఖాయం అంటూ రాజకీయ వర్గాలతోపాటు సోషల్ మీడియాలో చర్చలు నడుస్తుండటం కమలం పార్టీలో కాక రేపుతోంది. సరిగ్గా ఈ సమయంలోనే.. అధ్యక్ష పదవి మార్పు వ్యతిరేక బ్యాచ్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఇంట్లో సమావేశం కావడం హాట్‌టాపిక్‌గా మారింది. అధ్యక్ష పదవి మార్పు బీజేపీలో అంత ఆషామాషీ కాదని.. అసలు అంత అవసరం ఏముందని జితేందర్‌రెడ్డి టీమ్ వాదిస్తోంది. అయితే.. తన ఇంట్లో జరిగిన భేటీలో ఎలాంటి ప్రాధాన్యత లేదన్నారు జితేందర్‌రెడ్డి. కానీ.. పార్టీ ఇంటర్నల్ విషయాలు బయటకు రావడం.. కేసీఆర్ రోజుకో లీక్ ఇస్తూ బీజేపీ క్యాడర్‌ను తప్పుదోవ పట్టిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీని ఎదుర్కొలేకే బీఆర్ఎస్ అధినేత లీకుల ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు జితేందర్‌రెడ్డి.తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి మార్పు ప్రచారం సరికాదని, బీజేపీలో లీకుల పద్ధతి ఉండదన్నారు బీజేపీ నాయకురాలు విజయశాంతి. సార్వత్రిక ఎన్నికలు పూర్తి అయ్యే వరకూ బండి సంజయ్ కొనసాగుతారని తరుణ్ చుగ్ గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీని దెబ్బకొట్టేందుకు ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారంగా అభివర్ణిస్తూ విజయశాంతి ట్వీట్ చేశారు. వాస్తవానికి.. తెలంగాణ బీజేపీని హైరేంజ్‌కు తీసుకెళ్లడంలో బండి సంజయ్ కీలక పాత్ర పోషించారనడంలో ఎలాంటి సందేహం లేదు. దాదాపు మూడేళ్లకు పైగా కమలం పార్టీని పరుగులు పెట్టించారు. అయితే.. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. సారథి మార్పు ప్రచారం ఇబ్బందిగా మారుతోంది. ఈ అంశంపై ఇన్నాళ్లూ అలాంటిదేం లేదని సంకేతాలు ఇచ్చిన అధిష్టానం.. ఇప్పుడు సడీసప్పుడు చేయకపోవడం చర్చకు తావిస్తోంది. అధిష్టానం మనసులో ఏముందో కానీ.. తెలంగాణ బీజేపీ పరిణామాలపై రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. ఇక.. అధ్యక్ష పదవి మార్పుపై రియాక్ట్ అయిన బండి సంజయ్.. అది ప్రచారం మాత్రమేనని కొట్టిపారేశారు. అయితే.. పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించడానికి సిద్దంగా ఉన్నానన్నారు బండి.ఇదిలావుంటే.. అధ్యక్షుడి మార్పు అంశంపై ఈటల రాజేందర్ మాత్రం పెదవి విప్పడం లేదు. మీడియా చిట్‌చాట్‌లకు దూరంగా ఉంటానని చెబుతున్నారు. కానీ.. అధిష్టానం ఏం చెప్పినా చేయడానికి సిద్దంగా ఉన్నట్లు సన్నిహితులతో చెబుతున్నారు ఈటల. మొత్తంగా.. తెలంగాణ బీజేపీ పాలిటిక్స్ ఆసక్తికరంగా మారుతున్నాయి. అటు.. పార్టీ క్యాడర్‌లోనూ సందిగ్ధం నెలకొంది. ఈ నేపథ్యంలో అధిష్టానం ఎప్పుడు, ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి.

## రేవంత్ రెడ్డి సక్సెస్.. బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

తలలు పట్టుకుంటోందట. ఇప్పటికే పలువురు ముఖ్య నేతలు బీఆర్ఎస్‌కు బైబై చెప్పేసి కాంగ్రెస్ బీజేపీలో చేరిపోగా.. ఆ జాబితాలోకి మరి కొందరు నేతలు చేరిపోతున్నట్లుగా తాజాగా అందుతున్న సమాచారాన్ని బట్టి చూస్తే తెలుస్తోంది. ఆయన.. కీలక నేత, ఉద్యమకారుడు కావడంతో ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఇదే చర్చ నడుస్తోంది. బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన ఆ కీలక నేత మరెవరో కాదు తెలంగాణ ఉద్యమకారుడు కూచాడి శ్రీహరిరావు. ఈయన సీఎం కేసీఆర్ అత్యంత సన్నిహితుడిగా.. మంత్రి కేటీఆర్‌తోనూ దగ్గరి సంబంధాలు కలిగిన నేత. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి రాజకీయ శిష్యుడిగా శ్రీహరికి పేరుంది. ఉద్యమకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని పశ్చిమ ప్రాంతానికి సారథ్యం వహించిన ఈయన.. 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీచేసి గట్టిపోటీ ఇచ్చారు. అయితే.. 2018 ఎన్నికల టైమ్‌లో అధిష్ఠానం, కేటీఆర్ సూచనతో పోటీచేయకుండా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి మద్దతుగా నిలిచి గెలిపించారు. ఇన్నిరోజులుగా అంతా బాగానే ఉన్నా ఈ మధ్యే ఇంద్రకరణ్ రెడ్డితో శ్రీహరిరావుకు అస్సలు పడట్లేదు. కొన్ని అంతర్గత కారణాల దృష్ట్యా అటు మంత్రితో.. ఇటు పార్టీకి దూరమవుతూ వచ్చారు. ఇన్నాళ్లు పార్టీలో అసంతృప్తిగానే పార్టీలో ఉన్న శ్రీహరి.. ఎన్నికలు సమీపిస్తుండటంతో అనుచరులు, కార్యకర్తల ఒత్తిడి మేరకు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో అనుచరులు, ముఖ్య నేతలతో కూచాడి కీలక సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్‌లో పరిస్థితి ఇలా ఉంది..? అధిష్టానం పట్టించు కోవట్లేదు.. ఏ పార్టీలోకి వెళితే మంచిది..? అని అనుచరులతో శ్రీహరి చర్చించారు. కాంగ్రెస్‌లో చేరితే బాగుంటుందని అనుచరులు ఆయనకు చెప్పినట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం. సమావేశం అనంతరం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఉద్యమంలో ముందుండి పోరాడినప్పటికీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సరైన గుర్తింపు రాలేదని శ్రీహరి ఆవేదన వ్యక్తం చేశారు. రెండుసార్లు గెలిచిన బీఆర్ఎస్ ప్రజలను వంచించిందని.. ఇలాంటి మోసాలు చూడటం ఇష్టం లేక రాజీనామా చేస్తున్నాని ప్రకటించారు. అంతేకాదు.. ఆఖరిలో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని శ్రీహరి ఆకాంక్షించారు. అంటే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు చెప్పకనే చెప్పేశారన్న మాట.

**రేవంత్ ఆహ్వానంతోనే..?**

కాంగ్రెస్‌లో చేరాలని శ్రీహరికి.. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి గత నెలలోనే ఆహ్వానం పంపారు. ఇందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినప్పటికీ ముహూర్తం ఖరారు చేసుకోలేదు. వాస్తవానికి కర్ణాటక ఎన్నికల తర్వాత అధికారపార్టీలో ఎవరైతే అసంతృప్తులు ఉంటారో వారందర్నీ సంప్రదించి.. ఆహ్వానించే పనిలో రేవంత్ రెడ్డి బిజిబిజీగా ఉన్నారు. ఈ క్రమంలోనే శ్రీహరికి ఆహ్వానం పంపడం.. ఇవాళ ఆయన రాజీనామా చేయడం జరిగింది. అంటే.. రేవంత్ రెడ్డి మంత్రాంగం ఫలించిందన్న మాట. శ్రీహరి కాంగ్రెస్‌లో ఎప్పుడు చేరతారో.. చేరాక ఈయనకు పార్టీలో ఏ మాత్రం ప్రాధాన్యత ఉంటుందో తెలియాలి మరి.

## అవినాష్ బెయిల్ రద్దు... 19కు విచారణ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రాను అనుమించింది సుప్రీంకోర్టు బెంచ్. ఈ పిటిషన్ అత్యవసరంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది ధర్మాసనం. అవినాశ్ కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమా? లేదా? విచారణకు సహకరిస్తున్నాడా? లేదా? అన్నది దర్యాప్తు సంస్థ వ్యవహారం అని సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టు సెలవుల అనంతరం విచారణను స్వీకరిస్తామని బెంచ్ తెలిపింది. తదుపరి విచారణను జూన్ 19వ తేదీకి వాయిదా వేసింది ధర్మాసనం.కాగా, వివేకా హత్య కేసు దర్యాప్తును ఈ నెల 30వ తేదీలోగా ముగించాలని సుప్రీంకోర్టే స్వయంగా చెప్పిందని సునీత గుర్తు? చేశారు. ఈలోగా ఈ పిటిషన్‌పై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, ఇంకో ధర్మాసనం పెట్టిన డెడ్‌లైన్‌ను తాము మార్చలేమని స్పష్టం చేసింది. ఇక దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు తన వాదన వినిపించే అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టును సునీత కోరగా.. అది ఆ సంస్థ ఇష్టం అని, అందుకే జులై 3వ తేదీకి విచారణ వాయిదా వేస్తామని బెంచ్ పేర్కొంది. ఇక ఈ కేసులో హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను కూడా తప్పుపట్టారు సునీత. మొత్తంగా వాదనలు విన్న ధర్మాసనం.. ఈ కేసులో ఎలాంటి నోటీసులు ఇచ్చేందుకు తాము సిద్ధంగా లేమని, పిటిషనర్ కోరినందున తదుపరి విచారణను జూన్ 19వ తేదీన చేపడతామని స్పష్టం చేసింది సుప్రీం కోర్టు బెంచ్.

## చొప్పదండిలో ఘోర రోడ్డు ప్రమాదం

కరీంనగర్- ప్రభాత సూర్యుడు



కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్ లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. మృతులు నవీన్,మహేష్. చొప్పదండి, చాకుంట గ్రామాలకి చెందినవారు. ఘటనలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. పాలకుర్తి చరణ్ పరిస్థితి విషమంగా వుంది.

# జిహెచ్ఎంసి లో బీఆర్ఎస్ కార్పోరేటర్లతో మంత్రి కేటీఆర్ భేటీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మంగళవారం నాడు మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసిలోని బీఆర్ఎస్ కార్పోరేటర్లతో సమావేశం అయ్యారు. ఈ భేటకి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ లు నవీన్ రావు ,శంబిపూర్ రాజు, మేయర్ విజయలక్ష్మి ఇతర సీనియర్ పార్టీ నాయకులు హజరయ్యారు. ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు హైదరాబాద్ నగర అభివృద్ధికి పాటుపడుతున్న తీరుని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని వారికి మంత్రి మార్గదర్శనం చేశారు. 16వ తేదీన జిహెచ్ఎంసి వార్డ్ కార్యాలయాలను ప్రారంభిస్తున్నదని ఈ వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ వారితో మమేకమయ్యేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ ఉత్సవాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో 16వ తేదీన వార్డు కార్యాలయాల ప్రారంభం చేస్తున్నామని, వీటి ద్వారా నగరంలో సుపరిపాలన మరింత బలోపేతం అవుతుందన్నారు.



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు ప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలను, ప్రభుత్వ కార్యక్రమాలను వేగంగా అందించాలన్న ఉద్దేశంతో పరిపాలన వికేంద్రీకరణ సంస్కరణలను చేపట్టారని కేటీఆర్ తెలిపారు. ఈ ఆలోచన దృక్పథంలోంచి జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల, మండల కేంద్రాలు, గ్రామపంచాయతీలను నూతనంగా ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల ఇంటి ముందట నిలిపేందుకు ప్రయత్నం చేశామని తెలిపారు. ఇదే వికేంద్రీకరణ స్ఫూర్తితో వార్డ్ కార్యాలయాలను ఏర్పాటు చేయడం ద్వారా నగర ప్రజలకు మరిన్ని సేవలు అందుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు వార్డు కార్యాలయ వ్యవస్థను విస్తృతంగా ఉపయోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం జిహెచ్ఎంసి ఏర్పాటు చేస్తున్న వార్డు కార్యాలయ వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదని కేటీఆర్ తెలిపారు.

వార్డు కార్యాలయ వ్యవస్థపై అవగాహన కోసం జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఒక విస్తృతస్థాయి సమావేశం కార్పొరేటర్ల కోసం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 16వ తేదీన జరిగే వార్డు కార్యాలయ ప్రారంభోత్స వాలకు తమ పరిధిలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వార్డులోని ప్రముఖ వ్యక్తులు, సంఘాలను కలుపుకుపోయి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్పొరేటర్లు ఒకవైపు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకు వెళు తూనే పార్టీ బలోపేతం కోసం కూడా పని చేయాలని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సూచించారు. పార్టీ మరియు ప్రభుత్వం ఇచ్చే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. పార్టీ తరఫున నిర్వహించే సమావేశాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని, పార్టీ బలోపేతం ద్వారానే మనం మరొకసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి విజయం తథ్యం అన్న విశ్వాసం వ్యక్తం చేసిన మంత్రి కేటీఆర్, కార్పొరేటర్ల సారథ్యంలో తమ తమ వార్డుల్లో పార్టీని ఎన్నికలకు సమయత్తం చేయాలన్నారు.

## సంపాదకీయం

### లేబర్ ఇంటెన్సివ్ నుంచి క్యాపిటల్ ఇంటెన్సివ్

అంతులేని నిరుద్యోగం, అదే సమయంలో భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి బాటలో... ఏమిటి అంతర్యం. ఆసక్తితో దీనిగురించి పరిశీలన చేద్దాం. ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుంది అంటే ఆ దేశ శ్రామికశక్తి, వ్యవసాయరంగం నుంచి పారిశ్రామిక, సేవా రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతూ, తలసరి ఆదాయం తద్వారా జీడీపీ వృద్ధి చెందుతుందని అర్థం. కానీ దీనికి విరుద్ధంగా భారతదేశంలో ప్రస్తుతం పారిశ్రామిక రంగాల నుంచి శ్రామికశక్తి, వ్యవసాయ రంగం వైపు పయనిస్తోంది.ప్రతీ సంవత్సరం నూతనంగా 1.2 కోట్ల మంది శ్రామిక జనాభాగా చేరుతున్నారు. వీరిలో కేవలం 55 లక్షల మందికి మాత్రమే ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. 2021-22 లో ఉద్యోగం కోసం వెతుకుతున్న వారు సుమారు 10 మిలియన్ల మంది ఉండగా, కేవలం ఒక మిలియన్ వారికి మాత్రమే ఉపాధి లభిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగం నిర్మూలనకు కొన్ని చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో ఒకేషనల్ కోర్సులు అభివృద్ధి పరచాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి. పెద్దపెద్ద పెట్టుబడి, మెషనరీ టెక్నాలజీ ద్వారా ఉత్పత్తి చేసే రంగాలకు ప్రాధాన్యత తగ్గించి, లేబర్ ఇంటెన్సివ్ సెక్టార్‌లకు ప్రాధాన్యత పెంచాలి. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నేటి విద్యా విధానం, సబ్జెక్టులు ప్రవేశపెట్టాలి. ఖాళీ పోస్టుల భర్తీ చేయాలి. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం నూతన టెక్నాలజీ అభివృద్ధి పరచాలి. ప్రభుత్వ విధానాలను సమీక్ష చేసుకుని, శ్రామిక శక్తి ద్వారా ఉత్పత్తి రంగాల్లో వస్తు ఉత్పత్తికి ప్రాధాన్యత పెంచాలి.సీఎంఐఈ, సీఈడిఏ నివేదికల ప్రకారం 2016-17 నుంచి 2021-22 మధ్య కాలంలో 5.2 కోట్ల నుంచి 2.7 కోట్ల మంది తయారీ (పారిశ్రామిక) రంగాల నుంచి తగ్గారు. అంటే దాదాపు 50% తగ్గుదల సంభవించింది. టెక్స్టైల్స్, బిల్డింగ్ నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో ఉపాధి క్షీణత ఎక్కువగా ఉంటుంది. 2016-17 నుంచి 2021-22 మధ్య సంవత్సరాల్లో ఒక్క టెక్స్టైల్స్ రంగంలోనే 1.2 కోట్లుగా ఉన్న శ్రామికుల సంఖ్య 55 లక్షలకు చేరింది. గమ్మత్తైన విషయం ఏమిటంటే, 'లేబర్ ఇంటెన్సివ్ సెక్టార్ నుంచి క్యాపిటల్ ఇంటెన్సివ్' వైపు భారత్ ఆర్థిక వ్యవస్థ పయనిస్తోంది. ఇది ప్రమాదకరమైన పరిస్థితి. కేవలం నూతన మెషినరీ, టెక్నాలజీ ద్వారా వస్తు ఉత్పత్తి చేస్తూ, పెద్ద పెద్ద పెట్టుబడిదారుల చేతిలో బడా పారిశ్రామిక సంస్థలు ఉండటంతో, శ్రామిక జనాభాకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకపోయినా, వృద్ధి బాటలో ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోంది. దీంతో శ్రామిక జనాభా వ్యవసాయ రంగంలోకి వెనుదిరిగారు. అజీజ్ ప్రేమ్‌జీ నివేదిక ప్రకారం దేశంలో నిరుద్యోగం ఆకాశాన్ని తాకుతుందని తెలిపింది.2018 ఉత్తర ప్రదేశ్‌లో కేవలం ఐదవ తరగతి అర్హత కలిగిన 62 టెలిఫోన్ మెసెంజర్ పోస్టులకు 92,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారు ఉన్నారు. అలాగే రైల్వే గ్యాంగ్ మెన్, పోర్టర్ వంటి 67,000 పోస్టులకు 1.9 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని హోటల్స్‌లో కేవలం 4వ తరగతి అర్హత కలిగిన వెయిటర్ వంటి పోస్టులకు కూడా వేల సంఖ్యలో డిగ్రీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవడం విస్మయం కలిగిస్తోంది. అంటే నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో కనపడుతుంది. గత యూపీఏ ప్రభుత్వం నుంచి నేడు ఎన్‌డీఏ ప్రభుత్వం వరకూ దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతూ వస్తోంది. మేక్ ఇన్ ఇండియా, పీఎం స్కీం వంటి పథకాలు ఎన్ని వచ్చినా, దేశంలో శ్రామిక జనాభాకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించడం లేదు. అయితే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ఉచితాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న క్రమంలో కొంతమేరకు ఉపశమనం కలుగుతోంది. దేశ సగటు కంటే మూడు రెట్లు అధికంగా వివిధ రాష్ట్రాల్లో నిరుద్యోగం పెరుగుతోంది.ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థాపించే పరిశ్రమలకు యువ జనాభాకు, శ్రామిక శక్తికి పెద్ద పీట వేయడం ద్వారా నిర్మాణాత్మక రీతిలో, శాశ్వత ప్రాతిపదికన ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చు. కేవలం సేవా రంగం, రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయం, అభివృద్ధి తాత్కాలికమే అని భావించాలి. ఇది గాలి బుడగ వంటిది. కాబట్టి ప్రజల జీవితాల్లో నిజమైన అభివృద్ధి అంటే వారి తలసరి ఆదాయం పెరుగుదల మాత్రమే. జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. ద్రవ్యోల్బణం తగ్గాలి. ధరలు అందుబాటులో ఉండాలి. ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అండగా కాకుండా, పేద మధ్య తరగతి ప్రజల జీవితాలు మెరుగుపడే విధానాలకు అనుగుణంగా వివిధ పథకాలను ప్రవేశపెట్టి, శాశ్వత ప్రాతిపదికన దేశం ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసే విధంగా ప్రయత్నాలు ముమ్మరం చేయాలి.

# తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా డీకే శివకుమార్!

బెంగళూరు - ప్రభాత సూర్యుడు

దేశవ్యాప్తంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నా తన వ్యూహరచనతో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి విజయం చేకూర్చడంలో కీలకంగా వ్యవహరించిన ట్రబుల్ షూటర్, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌పై అధిష్టానం పెద్దలు మరో భారం పెట్టనున్నట్లు తెలిసింది. త్వరలోనే శాసనసభ ఎన్నికలు జరిగే తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా బాధ్యతలను అప్పగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. దక్షిణాదిలో పూర్తిగా ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో విజయంతో కొత్త శక్తి వచ్చింది. తెలంగాణలో టీఆర్ఎస్ వరుసగా రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తాజాగా బీఆర్ఎస్ పేరిట అటు జాతీయ రాజకీయాలవైపు దృష్టి సారించిన తెలంగాణ సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడానికి అన్ని రకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. కర్ణాటక ఎన్నికల ప్రచారం ముగించి హైదరాబాద్ వెళ్లిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ బహిరంగసభ విజయవంతం కావడంతో పార్టీకి మరింత ఊపు వచ్చింది. ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలనే విషయంలో నిష్ణాతుడిగా పేరుగాంచిన డీకే శివకుమార్‌అటు పార్టీ అధిష్టానానికి కూడా అత్యంత



విధేయుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్‌కు తెలంగాణ బాధ్యతలు అప్పగించడం ద్వారా అక్కడ పార్టీకి మరింత బలం చేకూరుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డివ్యతిరేకులను మళ్లీ పార్టీలోకి రప్పించే యత్నాలు బెంగళూరు కేంద్రంగా సాగుతున్నట్టు తెలుస్తోంది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, దామోదర్‌రెడ్డి తదితరులను తిరిగి కాంగ్రెస్ లోకి చేర్చుకునే ప్రయత్నాలు జరిగినట్టు తెలుస్తోంది.వీరంతా ఇటీవల బెంగళూరులో డీకే శివకుమార్‌ను కలసినట్టు సమాచారం. డీకే రంగంలోకి దిగితే అసమ్మతిని నియంత్రిస్తారనే పార్టీ పెద్దలు భావిస్తున్నారు. మరోవైపు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకురాలు వైఎస్ షర్మిల సైతం తరచూ డీకే శివకుమార్‌ను భేటీ కావడం వెనుక రాజకీయ కోణాలు వినిపిస్తున్నాయి. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తో డీకే శివకుమార్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. సీఎం సిద్ధరామయ్యతో కొన్ని అభిప్రాయభేదాలు ఉన్నా ఎన్నికలకు ముందు ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, భారీ బహిరంగసభలు, గెలుపొందాక ముఖ్యమంత్రి పదవి కోసం పట్టు, ఆపై మంత్రుల ఎంపిక, శాఖల కేటాయింపు వంటి అన్నింటా డీకే శివకుమార్ ఓ అడుగు వెనకేసి పార్టీ కోసమే ముందుకెళ్లారు. వీటన్నింటికీ ప్రధాన కారణం దక్షిణాదిన మనుగడలేని కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ద్వారా ఎక్కువ ఎంపీ స్థానాలు గెలుపొందాలనేదే అధిష్టానం వ్యూహంగా ఉంది. డీకే రంగంలోకి దిగితే రాజకీయం, ఆర్థికం, అంశాల్లోనూ తిరుగులేకుండా ముందుకెళ్తారు. కర్ణాటకలో ప్రకటించిన గ్యారెంటీల వంటి పథకాలు తెలంగాణలోనూ అమలు చేస్తామని ప్రజలకు భరోసా ఇవ్వదలిచినట్టు తెలుస్తోంది.

# ఆలస్యంగా ఆర్టీఏ అధికారుల ఎంట్రీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రవాణా శాఖ అధికారులు నిద్ర లేచారు. స్కూళ్లు, కాలేజీల బస్సుల ఫిట్నెస్ పై దృష్టి సారించారు. ఈ క్రమంలో విద్యా సంస్థలు ప్రారంభమైన సోమవారం వేర్వేరు చోట్ల స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఫిట్నెస్ లేని కొన్ని బస్సులను సీజ్ కూడా చేసారు. ఇంతవరకు బాగానే ఉన్నా తీరా స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమైన తర్వాత తనిఖీలు చేస్తుండటంపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనేదో వేసవి సెలవుల్లో పూర్తి చేస్తే బాగుండేదని అంటున్నారు. ఇప్పుడు బస్సులు సీజ్ చేస్తుండటంతో తమ పిల్లలు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికార వర్గాల ద్వారా తెలుస్తున్న ప్రకారం రాష్ట్రం మొత్తం మీద ఇరవై అయిదు వేలకు పైగా స్కూల్, కాలేజీ బస్సులు ఉన్నాయి. వీటిలో కనీసం ఇరవై శాతం బస్సులకు ఫిట్నెస్ సరిగ్గా లేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే రవాణా శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, అగ్నిమాపక పరికరాలు ఉన్నాయా? లేదా? అన్నది తనిఖీ చేస్తున్నారు. వాహనాల ఇంజన్ కండిషన్ పరీక్షిస్తున్నారు. టైర్లు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అని చూస్తున్నారు. అదే సమయంలో డ్రైవర్లకు లైసెన్స్ లు ఉన్నాయా? లేవా? అన్నది చెక్ చేస్తున్నారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి మూడు బస్సులను సీజ్ చేసారు. ఇబ్రహీంపట్నం వద్ద కూడా విస్తృత తనిఖీలు నిర్వహించి కొన్ని బస్సులను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల రక్షణ కోసం రవాణా శాఖ అధికారులు చేపట్టిన ఈ డ్రైవ్ పట్ల కొందరు హర్షం వ్యక్తం చేస్తున్నా చాలా మంది తల్లిదండ్రులు మాత్రం అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు. తమలో చాలా మంది ఉద్యోగాలు చేస్తున్న నేపథ్యంలో తమ తమ పిల్లల కోసం స్కూల్ కాలేజీ బస్సులను మాట్లాడుకున్నట్టు చెబుతున్నారు. సంవత్సరానికి వేలకు వేలు ట్రాన్స్పోర్ట్ ఫీజులు కడుతున్నామంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తీరా విద్యా సంస్థలు మొదలయ్యాక తనిఖీలు చేపట్టి బస్సులను సీజ్ చెయ్యటం ఏంటని ప్రశ్నిస్తున్నారు.నిజంగా రవాణా శాఖ అధికారులకు విద్యార్థిని, విద్యార్థుల భద్రతపై చిత్తశుద్ధి ఉండి ఉంటే వేసవి సెలవుల్లో ఫిట్నెస్ డ్రైవ్ చేపట్టి ఉండాల్సిందని తల్లిదండ్రులు అంటున్నారు. అప్పుడు చేసి ఉన్నట్టయితే అధికారులు రోడ్ల మీదకు వచ్చే అవసరం కూడా ఉండేది కాదన్నారు. బస్సులన్నీ ఆయా విద్యా సంస్థల క్యాంపస్ లలో అందుబాటులో ఉండేవని అన్నారు. ఫిట్నెస్ తనిఖీలు కూడా సమగ్రంగా జరిగి ఉండేవని చెబుతున్నారు. అప్పుడు నిద్రపోయి విద్యా సంస్థలు మొదలయ్యాక స్పెషల్ డ్రైవ్ పేర హడావుడి చెయ్యటం ఏందో తమకు అర్థం కావటం లేదన్నారు. ఇప్పుడు బస్సులు సీజ్ చేస్తే స్కూళ్లు, కాలేజీలకు వెళ్లటానికి పిల్లలు.. వారిని దించి రావటానికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.

# టీఎస్పీఎస్సీ ఉద్యోగులకు నిర్బంధ సెలవులు

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు

తెలంగాణ టీఎస్పీయస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జూన్ 11 ప్రశాంతంగా ముగిసింది. రద్దైరన పరీక్షతో పోల్చితే ఈసారి 50 వేల మంది తగ్గినట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి. పలువురు గ్రూప్-2, 4 పరీక్షలకు సన్నద్ధమవుతుండటంతో పోటీ తగ్గినట్లు తెలుస్తోంది. పరీక్షకు సంబంధించిన మాస్టర్ ప్రశ్నపత్రం, ప్రాథమిక కీని త్వరలోనే వెబ్‌సైట్లో పొందుపరిచేందుకు కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. తుది కీ విడుదల అనంతరం మూల్యాంకనం నిర్వహించి నెల రోజుల్లోగా ఫలితాలు వెల్లడించాలని భావిస్తోంది. మెయిన్స్ పరీక్షలకు మూడు నెలల సమయమిచ్చేలా కార్యచరణ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం సెప్టెంబరు నెలాఖరు వరకు పలు పోటీ పరీక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబరు లేదా నవంబరులో గ్రూపు-1 మెయిన్స్ నిర్వహించే అవకాశాలున్నట్లు సమాచారం. జూన్ 11న జరిగిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు.. రద్దయిన గత పరీక్షతో పోల్చితే దాదాపు 50 వేల మంది వరకు తగ్గారు.ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు ఎవరైనా గ్రూప్ 1 పరీక్షకు హాజరైనట్లయితే వారందరితో నిర్భంద సులవులు పెట్టించారు. పరీక్ష తేదీకి రెండు నెలల ముందు, పరీక్ష తరువాత నెల రోజుల వరకు ఉద్యోగాలకు సెలవు పెట్టించారు. గ్రూప్-1 పునఃపరీక్షకు పది మంది ఉద్యోగులు దరఖాస్తు చేయగా వారందరితో సెలవులు పెట్టించారు. దీంతో నిర్బంధ సెలవులోకి సిబ్బంది వెళ్లడంతో ఇతర ఉద్యోగులు అదనపు గంటలు పనిచేస్తున్నారు. ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో సోమవారం తెల్లవారుజాము 3 గంటల వరకు ఉద్యోగులు విధులు నిర్వహించారు.

# రైతులకు సంకెళ్లు..

## కేసీఆర్ సర్కార్ పై ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం

భువనగిరి- ప్రభాత సూర్యుడు

రైతులకు సంకెళ్లు వేయడంపై ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేసీఆర్ సర్కార్ పై మండిపడ్డారు. రీజనల్ రింగ్ రోడ్డు కోసం కొన్ని మాసాలుగా భూములు తీసుకుంటున్నారు. భూసేకరణ పేరుతో బలహీన వర్గాలు, హరిజన, దళితుల భూములను బలవంతంగా తీసుకుంటున్నారు. గవర్నమెంట్ భూములు తీసుకోకుండా.. రైతుల దగ్గర ఉన్న ఎకరం, రెండు ఎకరాల భూమిని గుంజుకుంటున్నారని అయన అన్నారు. తాతముత్తాతల నుంచి వారసత్వంగా వస్తున్న కొద్దిపాటి భూమి పోతోందన్న బాధతో, భువనగిరి, రాయగిరి, ఇంకా మిగిలిన గ్రామాల రైతులు పోరాటం చేస్తున్నారు. శాంతియుతంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అయినా, కొందర్ని అరెస్ట్ చేశారు. జైలుకు పంపారు. భువనగిరి జిల్లా సెషన్స్ కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది. అయితే.. కోర్టుకు తీసుకొచ్చే



క్రమంలో రాయగిరి రైతులకు బేడీలు వేశారు. ఇది చూసి కళ్లలో నీళ్లు తిరిగాయి. భువనగిరి పార్లమెంట్ సభ్యునిగా బరువెక్కిన గుండెతో మాట్లాడుతున్నా. ఇది మంచి పద్ధతి కాదు. రైతుల కోసం అంత చేస్తా.. ఇంత చేస్తున్నా అని చెప్పుకుంటున్న కేసీఆర్ దీనిపై ఏం సమాధానం చెప్తారు. రైతులకు సంకెళ్లు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామనిఅన్నారు. దీనికి సంబంధించిన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా. కేసును బేషరతుగా ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వ భూమి ఉంచుకుని.. రైతుల నుంచి భూమి లాక్కో వడం కరెక్ట్ కాదు. అన్నదాతలకు సంకెళ్లు వేయ డం రాష్ట్ర రైతాంగాన్ని అవమానిం చడమే. అన్నం పెట్టే రైతులకే సంకెళ్లు వేయడాన్ని భువనగిరి పార్లమెంట్ సభ్యునిగా తీవ్రంగా ఖండిస్తున్నా. రాయగిరి ట్రిబుల్ ఆర్ రైతులకు సంకెళ్లు వేయడం కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శనమని అన్నారు.



## విద్యార్థుల చదువులకు తల్లితండ్రులు ప్రోత్సహించాలి

**పాఠశాల చైర్మన్ వడ్డే రాముడు**



కౌతాళం – ప్రభాత సూర్యుడు

విద్యార్థుల చదువులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని ప్రతి ఒక్క తల్లిదండ్రులు విద్యార్థులకు ప్రోత్సహించాలని జిల్లా ఉన్నత పాఠశాల చైర్మన్ వడ్డే రాముడు పేర్కొన్నారు మంగళవారం. మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు గౌరమ్మ అధ్యక్షతన జిల్లా ఉన్నత పాఠశాల చైర్మన్ ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమం జరిగింది,ఈ కార్యక్రమంనకు అతిథులుగా మండల నాయకులు ప్రహ్లాద చారి, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, సర్పంచ్ పాల్ దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, ఉపసర్పంచ్ తిక్కయ్య, సమాద్, హాజరయ్యారు. ఉన్నత పాఠశాల చైర్మన్ మరియు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. 4 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం కూడా యూనిఫాం, నోట్ బుక్స్,డిక్షనరీ, టెక్ట్స్ బుక్స్,షూస్, బెల్ట్,సాక్స్ తో పాటు రాగిజావా ఇవ్వడం జరిగిందని తెలిపారు,అంతేగాక అమ్మ ఒడి కార్యక్రమంలో ప్రతి సంవత్సరం రు.13000 లు ఇస్తున్నారు. అనీ వైసీపీ నాయకులు అన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సర్పంచ్ పాల్ దినకర్ వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి ఉప సర్పంచ్ తిక్కయ్య సమద్ చౌదరి బసవ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పత్తి విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

పత్తి విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. పత్తి సాగుకు రైతులు ఉపయోగించేది ఃఉ ఎ ఎ హైబ్రిడ్ విత్తనాలు అని.. అన్ని కంపెనీల పత్తి విత్తనాలు ఒక్కటే రకమైనవేనని తెలిపారు. ప్రైవేటు కంపెనీలు ఉత్పత్తి చేసే ఈ విత్తనాల 400 గ్రాముల ప్యాకెట్ ధరను కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.450గా నిర్ణయించిందని పేర్కొన్నారు. పత్తి విత్తనాల ధరను నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వమే అయినప్పటికీ వాటి నియంత్రణ రాష్ట్రాల చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేశారు.అయితే కొన్ని కంపెనీలు దురాశతో పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. అటువంటి డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని.. అవసరమైతే వాళ్ల లైసెన్స్‌లు రద్దు చేయడానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు. విత్తనాలు దొరకవేమో అని రైతులు కంగారు పడొద్దని.. అవసరమైన దానికంటే అధికంగానే పత్తి విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సీజన్‌లో 65 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేశారని.. అంటే 58,500 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని పేర్కొన్నారు. అయితే మార్కెట్‌లో అన్ని కంపెనీల విత్తనాలు కలిపి 77,500 క్వింటాళ్ల వరకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

## మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి కన్నుమూత



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి కన్నుమూశారు. గచ్చిబౌలి ఏఐజి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ రోజు తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో దయాకర్ రెడ్డి తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా కాన్సర్ వ్యాధితో దయాకర్ రెడ్డి బాధపడుతున్నారు. మూడుసార్లు టీడీపీ తరపున కొత్తకోట దయాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అమరచింత నుంచి రెండుసార్లు మక్తల్ నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి గాను దయాకర్ రెడ్డి పనిచేశారు.తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి మృతి పట్ల మంత్రి సింగిరెడ్డి నిరంజన్?రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. దయాకర్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు. దయాకర్ రెడ్డి మృతిపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తీవ్రగ్భ్రాంతికి గురయ్యారు. దయాకర్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దయాకర్‌రెడ్డి మృతి పట్ల తెలంగాణా టిడిపి అద్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసారు. దయాకర్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు

# దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం కేసీఆర్

**-నియోజకవర్గంలో అండగా నిలుస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు**

**-మంథని నియోజకవర్గ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్**



మంథని – ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లుగానే మంథని నియోజకవర్గంలోని దివ్యాంగులకు జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అండగా నిలుస్తున్నారని మంథని నియోజకవర్గ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు.దివ్యాంగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ 4వేల16 రూపాయలకు పెన్షన్ పెంచినందుకు కృతజ్ఞతగా మంగళవారం మంథని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి, జడ్పీ చైర్మన్ పుట్ట మధు చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం నిర్వహించారు. మంథని నియోజకవర్గ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎంతో మంది దివ్యాంగులకు తనవంతు సహకారాన్ని పుట్ట మధు అందించారని కొనియాడారు. తన తల్లిపేరున స్థాపించిన పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా దివ్యాంగులకు బ్యాటరీతో కూడిన మూడు చక్రాల సైకిళ్లు, వాహనాలు అందించారని, అలాగే ప్రభుత్వపరంగా అందే లబ్దిని సైతం చేకూర్చారని ఆయన అన్నారు. దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదని సకలాంగులతో సమానంగా చూడాలనే ఆలోచనతోనే జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ దివ్యాంగులకు తనవంతు సహకారం అందిస్తున్నారని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ నాయకుడు దివ్యాంగుల పక్షాన నిలువలేదని, కనీస సాయం అందించలేదని అన్నారు. పుట్ట మధూకర్‌లాంటి నాయకుడు లేడని తమలాంటి దివ్యాంగులకు అందించే సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించి చెప్పాలి...

**- కార్యకర్తలు మరింత పట్టుదలతో కష్టపడి పనిచేస్తే విజయం బిజెపి దే....**

**- జిల్లా అధ్యక్షులు రావులరాజేందర్ ,బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి**



కమాన్ పూర్ – ప్రభాత సూర్యుడు

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ బీజేపీ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కమాన్ పూర్ మండల స్థాయి కార్యకర్తల సమావేశం కమాన్ పూర్ బిజెపి మండల అధ్యక్షులు జంగపల్లి అజయ్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిధిలుగా జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్ , రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి పాల్గొని కమాన్ పూర్ మండల పార్టీ ఆఫీస్ ను ప్రారంభించి,కార్యకర్తలకు భవిష్యత్తు కార్యాచరణ వివరించారు, అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకలు మరింతగా ప్రజలకు వివరించాలని, కేంద్రం లో మళ్ళీ మనమే అధికారం లోకి వస్తున్నాం, మన ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచం లో భారత దేశాన్ని ఒక మార్గదర్శకంగా తీర్చిదిద్దరు, కరోనా తో ప్రపంచం అల్లాడి పోతుంటే ఉచిత టీకాలు ఇచ్చి ఆదుకున్నారు,బి ఆర్ స్ కు గట్టి పోటీ ఇస్తున్న పార్టీ బీజేపీ పార్టీ,బి ఆర్ స్ నియంత, కుటుంబ పాలనకు చరమ గీతం బీజేపీ పార్టీ తో పాడుదాం, పార్టీని నమ్ముకున్న వారికి పార్టీ లో సముచిత స్థానం ఉంటుంది, కష్టపడ కార్యకర్తకు గుర్తింపు బీజేపీ పార్టీ లో ఉంటుంది దానికి నిదర్శనం మన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ , రానున్న రోజుల్లో బీజేపీ మరింత పుంజుకుంటుంది, మంథని ప్రాంతంలో ప్రజలు మార్పు కోరు కుంటున్నారు, బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలి, కాంగ్రెస్, బి ఆర్ స్ మంథనికి చేసిన అన్యాయని, దోపిడీని ప్రజలకి మనమే వివరించాలి, ప్రజల్లో చర్చ జరగాలి కేంద్రం లో మరోసారి బీజేపీ తెలంగాణలో ఈసారి బీజేపీ అనే నినాదం ముందుకు సాగుదాం అన్నారు .ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వరాష్ట్రంలోనే గురుకులాలు బాగుపడ్డాయి

**విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలి**

**-తెలంగాణ అవతరణ ఉత్సవాలలో జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్**



మంథని – ప్రభాత సూర్యుడు

స్వరాష్ట్రంలోనే గురుకులాలు బాగుపడ్డాయని, విద్యార్థులు చదువులలో రాణించి ఉన్నత స్థితికి చేరుకోవాలని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా తెలంగాణ అవతరణ దశాబ్ద ఉత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని రాష్ట్రంలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం మంథని పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలురు) లో ప్రిన్సిపల్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అవతరణ దినోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో గ్యాలరీని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక విద్యాసంస్థలు గణనీయంగా అభివృద్ధి చెందాయని, ప్రభుత్వ పాఠశాలలో, గురుకులాలలో ఆంగ్ల విద్య ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థుల జీవితాలలో వెలుగులు నిండుకున్నాయని, గురుకు లాల ద్వారా మట్టిలో మాణిక్యాలు గుర్తించబడ ుతుందన్నారు. విద్యార్థులకు సరైన అవగాహనతో వారికి దిశ నిర్దేశం చేస్తే వారు ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. గతంలో తెలంగాణ రాకముందు విద్యాసంస్థలు దీనస్థితిలో ఉన్నాయని, తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో గణనీయంగా విద్యాసంస్థలు పురోగతిని సాధించాయ న్నారు. విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాల కోసం మన ఊరు మన బడి అనే గొప్ప కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం చాలా ఆనందకరంగా ఉందన్నారు. జీవితంలో ఉన్నత ఆశయం పెట్టుకుని ఆశయానికి అనుగుణంగా విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఎంపీపీ కొండ శంకర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మహేష్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ రాజు, బోధన, బోధనేతర సిబ్బంది , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిపై పూల వర్షం

మహబూబ్ నగర్ – ప్రభాత సూర్యుడు

మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తరుణంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బికే రెడ్డి కాలనీకి చెందిన కౌన్సిలర్ ఆనంద్ కుమార్ గౌడ్, హర్షవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బుక్క రవి సహా స్థానికులు మంత్రిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. మంత్రిపై పూల జల్లు కురిపించి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని ట్యాంక్ బండ్ వద్ద పార్టీ చేరికల అనంతరం మంత్రి వారించిన వినకుండా నాయకులు కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. అభిమానులు కార్యకర్తలు జై శ్రీనన్న అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మంత్రి ట్యాంక్ బండ్ నుంచి నేరుగా వార్డు పర్యటనకు బయలుదేరారు.బికే రెడ్డి కాలనీలో వీధులన్నీ కలియతిరిగారు. ఇంటింటికి వెళ్లి స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, సిబ్బందికి చేపట్టాల్సిన పనుల వివరాలను మంత్రి తెలియచేశారు. మంత్రి వెంట మునిసిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ ఆనంద్‌కుమార్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215